క్లుప్తంగా

కలెక్టర్‌కు శుభాకాంక్షలు



కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న శ్రీవారి దేవస్థానం ఈఓ

ద్వారకాతిరుమల: నూతన సంవత్సరం సందర్భంగా ఏలూరు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌ను ద్వారకాతిరుమల శ్రీవారి దేవస్థానం ఈఓ వేండ్ర త్రినాధరావు సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీవారి శేష వస్త్రాన్ని కప్పి, ప్రసాదాలను అందించారు. అలాగే రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యన్నారాయణ, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ సత్యన్నారాయణ తదితర ప్రముఖులను ఈవో త్రినాధరావు కలసి శుభాకాంక్షలు చెప్పారు.

విజయవాడ తరలివెళ్లిన భవానీలు



బుట్టాయగూడెం నుంచి విజయవాడ దుర్గమ్మ దర్శనానికి కాలినడకన వెళ్తున్న భవానీలు

బుట్టాయగూడెం: భవానీ మాలధారులు సోమవారం స్థానిక శివాలయంలో ఇరుముడులు కార్యక్రమం నిర్వహించారు. మండల దీక్షను పూర్తి చేసుకున్న భవానీలు సోమవారం పాదయాత్రగా విజయవాడ తరలివెళ్లారు. సుమారు 3 రోజులపాటు కాలినడకన వెళ్లి విజయవాడలోని ఇంద్రకీలాద్రి చేరుకుని దుర్గమ్మను దర్శించుకుని ఇరుముడులు సమర్పిస్తామని భవానీలు చెప్పారు.

మత్స్యకారులకు తెప్పల అందజేత



బొర్రంపాలెంలో మత్స్యకారులకు తెప్పలను అందజేస్తున్న అభిషేక్‌బాబు

టి.నరసాపురం: మిచౌంగ్ తుపాను కారణంగా తెప్పలు కొట్టుకుపోయి ఇబ్బందులు పడుతున్న 30 మంది మత్స్యకారులకు సోమవారం తెప్పలను అందజేశారు. బొర్రంపాలెం మాజీ సర్పంచ్ పెండ్యాల మల్లిబాబు కుమారుడు వైఎస్సార్ సీపీ యువ నాయకులు పెండ్యాల అభిషేక్‌బాబు రూ.50 వేల విలువ చేసే తెప్పలను 30 మంది మత్స్యకారులకు అందజేశారు. ఈ సందర్భంగా అభిషేక్‌బాబు మాట్లాడుతూ మత్స్యకార కుటుంబాలు పడుతున్న ఇబ్బందులు తన దృష్టికి వచ్చిందని, వారికి తన వంతు సహాయం అందించాలనే ఉద్దేశ్యంతోనే వారి జీవనోపాధికి ఉపయోగపడేవిధంగా తెప్పలు అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘ నాయకులు కర్రె జక్రయ్య, బత్తుల రమేష్, రాజామోని రమేష్, గుండె పాండుంగ తదితరులు పాల్గొన్నారు.


కాశీ విశ్వేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



విశేషాలంకరణలో కాశీ విశ్వేశ్వర స్వామి

టి.నరసాపురం: స్థానిక కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన సంవత్సరం పురస్కరించుకుని అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి వెళ్లి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు జరిపారు. నూతన సంవత్సరంలో తమకు మంచి జరగాలని ఆ భగవంతుడిని ప్రార్థించారు.

ఎర్రకాలువ నుంచి సాగునీటి విడుదల



సాగునీటిని విడుదల చేస్తున్న ప్రజాప్రతినిధులు

జంగారెడ్డిగూడెం రూరల్: చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా ఆదేశాల మేరకు కొంగువారిగూడెం కేకేఎం ఎర్రకాలువ జలాశయం పంట కాలువల నుంచి సాగునీటిని విడుదల చేశారు. గురవాయిగూడెం సర్పంచ్ గుబ్బల సత్యవేణి, ఎంపీటీసీ కొయ్య రమారెడ్డి చేతుల మీదుగా కుడి, ఎడమ కాలువల ద్వారా నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు రైతులకు పూర్తిస్థాయిలో సాగునీటిని అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వేముల బాల గురవయ్య, కొయ్య లీలాధర రెడ్డి, దల్లి అప్పలరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కోలాహలంగా నూతన సంవత్సర వేడుకలు

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలో నూతన సంవత్సర వేడుకలు సోమవారం కోలాహలంగా జరిగాయి. పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఇంట నూతన సంవత్సర వేడుకలు అంబరాన్నంటాయి. తెల్లవారుజాము నుంచే ఆయన స్వగ్రామమైన దుద్దుకూరుకు భారీ సంఖ్యలో అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. పుస్తకాలు, పెన్నులు, అట్టలను ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కొందరు పూలదండలు, పూలబొకేలతో శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గంలోని 7 మండలాల పరిధిలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, అభిమానులు ఎమ్మెల్యే బాలరాజుకు ఆయన సతీమణి తెల్లం రాజ్యలక్ష్మికి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలరాజు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. పురోహితులు అనిపెద్ది విశ్వనాథ శర్మ ప్రత్యేక పూజలు చేసి బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులను ఆశీర్వదించారు. ఇదిలా ఉండగా బుట్టాయగూడెంలోని ఏఎంసీ చైర్‌పర్సన్ ఆరేటి శాంత కుమారి ఇంటి వద్ద ఈ వేడుకల సందడి నెలకొంది. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, అధికారులు శాంత కుమారిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఐటీడీఏలో...

కేఆర్‌పురం ఐటీడీఏలో సోమవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజకు సిబ్బందితోపాటు ఐటీడీఏ పరిధిలోని అన్ని రకాల శాఖల అధికారులు పీఓను కలుసుకుని పుష్పగుచ్ఛాలు ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే డీడీ పీవీఎస్ నాయుడుని గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు.

ఎమ్మెల్యే తలారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు

ద్వారకాతిరుమల: గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావుకు వైఎస్సార్ సీపీ మండల నాయకులు, కార్యకర్తలు సోమవారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. దీంతో దేవరపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయం పార్టీ శ్రేణులు, నియోజకవర్గంలోని నాలుగు మండలాల అధికారులు, సిబ్బందితో కోలాహలంగా మారింది. ముందుగా రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, శ్రీవారి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు మానుకొండ సుబ్బారావు, పెద్దిరెడ్డి జ్యోతిశ్రీనివాస్, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, ఉక్కుర్తి వెంకట్రావు, నాగనబోయిన రవి యాదవ్ తదితరులు ఎమ్మెల్యేకు దుశ్శాలువా కప్పి, పూల బొకేలు, పండ్లు అందించి, శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ద్వారకాతిరుమల చినవెంకన్న దేవస్థానం ఈఓ వేండ్ర త్రినాధరావు ఎమ్మెల్యే తలారిని మర్యాద పూర్వకంగా కలసి, స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి, ప్రసాదాలను అందజేశారు. అదేవిధంగా తహసీల్దార్ పి.సతీష్, ఎంపీడీవో తిరుపతిరావు, ఎస్సై టి.సుధీర్, ఎంఈఓ పరసా వెంకట్రావు, యూటీఎఫ్ నాయకులతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు యలమర్తి గాంధి, గంటా విఘ్నేశ్వరరావు, యలమర్తి సుబ్రహ్మణ్యం, సొసైటీ చైర్‌పర్సన్‌లు గోపా నాగేశ్వరరావు, చెరుకూరి ప్రసాదరావు, గుర్రాల లక్ష్మణ్, కోఆప్షన్ సభ్యుడు షేక్ భాషా, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు మల్లెపూడి నాగమణి, భోగరాజు చిన్ని, వసంతాటి శ్రీనివాస్ తదితరులు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు.

నూతన సంవత్సరంలో అందరూ బాగుండాలి

నూతన ఆంగ్ల సంవత్సరంలో ప్రతి ఒక్కరూ బాగుండాలని ఆకాంక్షిస్తున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏలూరు పార్లమెంట్ మహిళా విభాగ కన్వీనర్ వందనపు సాయి బాల పద్మ అన్నారు. మాజీ సొసైటీ అధ్యక్షుడు వందనపు వెంకటేశ్వరరావు కార్యాలయం వద్ద చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో పట్టణానికి చెందిన 28 వర్తక వాణిజ్య సంఘాల అధ్యక్ష కార్యవర్గం ప్రతినిధులు భారీ కేక్ ని కట్ చేశారు. కిరాణా వర్తక సంఘం అధ్యక్షులు ఉప్పల గంగాధర్, కార్యదర్శి కొల్లేపర ఆనంద్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బుట్టాయగూడెం: ఎమ్మెల్యే బాలరాజుకు శుభాకాంక్షలు తెలుపుతున్న పోలీసులు



ద్వారకాతిరుమల: ఎమ్మెల్యే వెంకట్రావును గజమాలతో సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

కొయ్యలగూడెంలో...

కొయ్యలగూడెం: నూతన సంవత్సర వేడుకలు సోమవారం మండల వ్యాప్తంగా ప్రజలు ఘనంగా నిర్వహించారు. పరింపూడి పంచాయతీ కార్యాలయం వద్ద ఈవో సీహెచ్ సత్యనారాయణ ఆధ్వర్యంలో సర్పంచ్ ముప్పిడి విజయకుమారి కేక్ కట్ చేసి పంచాయతీ సిబ్బందికి ప్రజాప్రతినిధులకు స్వీట్లు పంపిణీ చేశారు. కొత్త సంవత్సరంలో ప్రజలు ఆనందంగా గడపాలని, పంచాయతీ అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. బయ్యనగూడెంలో వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు, ఉపసర్పంచ్ కోరుకొండ లలిత ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఆర్‌సీఎం, లూథరన్, కెనన్యా మినిస్ట్రీస్, సీయోను ప్రార్థన మందిరం, చర్చి లలో సేవా కార్యక్రమాలు, నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు.

శ్రీనివాసపురంలో...

జంగారెడ్డిగూడెం రూరల్: కొత్త సంవత్సరంలో ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి అన్నారు. మండలంలోని శ్రీనివాసపురంలో నూతన సంవత్సర వేడుకల్లో ఆయన కేక్ కట్ చేసి అందరికీ నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కొదమ జ్యోతి, ఎంపీడీవో కె. విజయ్ ప్రసాద్, ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొని ఒకరికొకరు కొత్త సంవత్సరం శుభాకాంక్షలను చెప్పుకున్నారు. ఎంపీపీ కొదమ జ్యోతి మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో ప్రతి ఒక్కరూ తమ తమ రంగాల్లో రాణించాలని అన్నారు.

చింతలపూడిలో...

చింతలపూడి: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా సీఐ ఎంవీఎస్ మల్లేశ్వరరావు దంపతులు సోమవారం స్థానిక లిబర్టీ చిల్డ్రన్స్ హోంలో చిన్నారుల మధ్య నూతన సంవత్సర వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులతో కేక్ కట్ చేయించి పంచి పెట్టారు. కార్యక్రమంలో సర్కిల్ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను మళ్లీ గెలిపించుకోవాలి

జంగారెడ్డిగూడెం: సంక్షేమ పాలన నిరంతరాయంగా కొనసాలంటే ఈ ఏడాది జరిగే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. జంగారెడ్డిగూడెంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలు, చైర్‌పర్సన్ జన్మదిన వేడుకలు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ నూతన సంవత్సరంలో వృద్ధులకు, వితంతువులు, దివ్యాంగులకు రూ.3 వేలు పింఛన్‌నూ అందిస్తూ వైఎస్సార్ సీపీ ఈ సంవత్సరాన్ని దిగ్విజయంగా ప్రారంభించిందన్నారు. ఈ విధంగా కొత్త పథకాలతో సంక్షేమం నిరంతరాయంగా కొనసాగాలంటే రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. తొలుత నూతన సంవత్సర, చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి జన్మదినోత్సవ కేక్‌ను చైర్‌పర్సన్ లక్ష్మితో పాటు నాయకులు కట్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, పామర్రు నియోజకవర్గ పరిశీలకులు మండవల్లి విజయసారథి, సీనియర్ నాయకులు మేడవరపు విద్యాసాగర్, బత్తిన చిన్న, వైస్ చైర్మన్ ముప్పిడి అంజి, పెసరగంటి త్రిమూర్తులు, నేకూరి కిషోర్, ఉగ్గం దుర్గాప్రసాద్, తడికమళ్ల మురళి, మానవత మూర్తి, దొంతు మాధవ, గెద్దాడ శ్రీను, కంచుమర్తి ప్రకాష్, మున్సిపల్ కమిషనర్ పి.భవానీప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెం: మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



బుట్టాయగూడెం: కేఆర్‌పురం ఐటీడీఏలో పీఓ సూర్యతేజకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు



జంగారెడ్డిగూడెం: కేక్‌ను కట్‌చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా మహిళా విభాగ కన్వీనర్ వందనపు సాయిబాల పద్మ



కొయ్యలగూడెం: పరింపూడి పంచాయతీ కార్యాలయం వద్ద వేడుకలు నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



చింతలపూడి: లిబర్టీ చిల్డ్రన్స్ హోంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహిస్తున్న సీఐ దంపతులు

'అనన్య' చిత్రం ఆడియో విడుదల

జంగారెడ్డిగూడెం: సినిమా షూటింగ్‌లకు జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంతాలు ఎంతో అనువైనవని జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పోల్నాటి బాబ్జి అన్నారు. పట్టణంలోని నూకాలమ్మ ఆలయ ప్రాంగణంలో సోమవారం అనన్య చిత్రం ఆడియో లాంచింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బాబ్జి ఆడియో సాంగ్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనన్య చిత్రం ఈ ప్రాంత నటీనటులతో తీయడం అభినందనీయం అన్నారు. గతంలో ఈ ప్రాంతంలో చాలా సినిమాలు తీశారని, ఇకముందు కూడా నిర్మాత దర్శకులు ఈ ప్రాంతాల్లో సినిమాలను చిత్రీకరించాలని కోరారు. అనన్య చిత్రం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. చిత్ర నిర్మాత, దర్శకులు జంధ్యాల నాగ శివ గంగాధర శ్రమ, బి.ప్రసాదరాజు మాట్లాడుతూ కుటుంబసమేతంగా చూడదగిన హారర్ చిత్రం అనన్య అని తెలిపారు. ఐదు పాటలు, నాలుగు ఫైట్‌లతో చిత్రం మొత్తాన్ని జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంతాల్లోనే తీసినట్లు చెప్పారు. ప్రివ్యూ అద్భుతంగా వచ్చిందని, సినిమా తప్పక విజయవంతం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఫిబ్రవరి మొదటి వారంలో చిత్రాన్ని విడుదల చేసేందుకు నిర్ణయించినట్లు చెప్పారు. హీరో జై రామన్, విలన్ రాజేష్, కోప్రొడ్యూసర్ బుద్దాల సత్యనారాయణ, రాజాన పండు, సింగంశెట్టి సత్తిరాజు, కనుపర్తి వేణుమాధవ్, టెక్స్‌మో శ్రీరాములు, పోల్నాటి దుర్గారావు, కేఎస్ శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.



అనన్య చిత్రం ఆడియోను విడుదల చేస్తున్న జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి తదితరులు

స్పందన ఆర్థిక సహాయం

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం స్పందన స్వచ్ఛంద సేవా సంస్థ ఇరువురు క్షతగాత్రులకు నూతన సంవత్సర సందర్భంగా సోమవారం ఆర్థిక సహాయాన్ని ప్రకటించింది. 2024 జనవరి 1 నుంచి డిసెంబర్ వరకు ఇద్దరు ప్రమాద బాధితులకు నెలకు వెయ్యి రూపాయల చొప్పున అందజేయనున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బలుసు నాగేశ్వరరావు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత కొత్తూరు కాలనీకి చెందిన కంచుమర్తి శ్రీనివాస్ రోడ్డు ప్రమాదానికి గురై రెండు కాళ్లు కోల్పోయాడు. అలాగే గవరవరానికి చెందిన తప్పెట్ల శ్రీనివాస్‌కు గతేడాది రోడ్డు ప్రమాదంలో బ్రెయిన్ ఆపరేషన్ జరిగింది. బాధితులు ఇద్దరికి మందుల ఖర్చులు నిమిత్తం ఏడాది పాటు ప్రతినెలా ఆర్థిక సహాయం అందజేస్తామని నాగేశ్వరరావు తెలిపారు. ఈ నెలకు సంబంధించిన ఆర్థిక సహాయాన్ని వారు క్షతగాత్రుల వద్దకు వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు ఆర్.ప్రవీణ్ కుమార్, సభ్యులు కంభంపాటి రామ్మోహన్‌రావు, కోశాధికారి ఎస్‌కే జహంగీర్ భాష పాల్గొన్నారు.



గవరవరంలో శ్రీనివాస్‌కు ఆర్థిక సహాయం అందజేస్తున్న స్పందన స్వచ్ఛంద సంస్థ సభ్యులు

రేపటి నుంచి ప్రజా ఆశీర్వాద యాత్ర

ఏలూరు రూరల్: ఈ నెల 3 నుంచి 9వ తేదీ వరకు దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఏలూరు రూరల్ గ్రామాల్లో ఆశీర్వాదయాత్ర నిర్వహిస్తారని ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు తెలిపారు. యాత్రపై సోమవారం తన కార్యాలయంలో పలు గ్రామాల నాయకులతో చర్చించారు. 3వ తేదీ సాయంత్రం 3 గంటలకు పైడిచింతపాడు నుంచి పాదయాత్ర ప్రారంభమౌతుందన్నారు. గ్రామంలో నిర్వహించే రాష్ట్ర వడ్డీ కుల కార్పొరేషన్ చైర్మన్ ముంగర సంజీవ్‌కుమార్ పదవీ స్వీకారం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారని చెప్పారు. అనంతరం ప్రత్తికోళ్లలంకకు చేరి గడపగడపకు తిరిగి ప్రజలను కలుసుకుని పల్లె నిద్ర చేస్తారన్నారు. 4న ఉదయం కొక్కిరాయిలంక మీదుగా గుడివాకలంక చేరి రాత్రికి అక్కడే సేద తీరుతారని, 5న ఉదయం మాదవాపురం, కోటేశ్వరదుర్గాపురం, తిమ్మారావుగూడెం మీదుగా చాటపర్రుకు చేరకుని పల్లె నిద్ర చేస్తారని వివరించారు. 6న ఉదయం నుంచి సాయంత్రం వరకు చాటపర్రులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారని, 8న ఉదయం బాబూఖాన్‌గూడెం మీదుగా జాలిపూడి వరకు పాదయాత్ర చేసి పల్లెనిద్ర చేస్తారని తెలిపారు. 9న ఉదయం నుంచి సాయంత్రం వరకు కాట్లంపూడి, మాదేపల్లి మీదగా శ్రీపర్రు వరకు పాదయాత్ర చేస్తారన్నారు. యాత్రలో భాగంగా సుమారు రూ.5 కోట్లతో నిర్వహించిన సీసీ రోడ్లు, సచివాలయం, వైఎస్సార్ క్లినిక్, ఓవర్‌హెడ్ ట్యాంక్, కల్వర్ట్ తదితర అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభిస్తారన్నాని వివరించారు.

'ఆపస్' కృషి అభినందనీయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థులతో పాటు, ఉపాధ్యాయుల్లో జాతీయ భావాలు పెంచడానికి కృషి చేస్తున్న ఏపీ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) కార్యకర్తలను డీఈవో పి.శ్యామ్‌సుందర్ అభినందించారు. సోమవారం డీఈవో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆపస్ క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. డైరీని జెడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు.

అడుగడుగునా శ్రీవారికి నీరాజనాలు

ద్వారకాతిరుమల: నూతన సంవత్సరం తొలిరోజున తమ ఇంటి ముంగిటకు వచ్చిన శ్రీవారికి భక్తులు పూజాదికాలు జరిపి, నీరాజనాలు సమర్పించారు. చినవెంకన్న దివ్య క్షేత్రంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం నిర్వహించిన తిరువీధి సేవ భక్తులకు నేత్రపర్వమైంది. తొలుత ఆలయంలో స్వామి, అమ్మవార్లు, గోదాదేవి ఉత్సవ మూర్తులను తొళక్క వాహనంపై ఉంచి ప్రత్యేక పుష్పాలంకారాలు చేశారు. అనంతరం మేళతాళలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణలు, గజ, అశ్వ సేవల నడుమ స్వామివారి వాహనం క్షేత్ర పురవీధులకు పయనమైంది. తిరువీధుల్లో స్వామివారికి అడుగడుగునా భక్తులు నీరాజనాలు సమర్పించారు. అనంతరం ఆలయ ప్రధాన కూడలిలోని ధనుర్మాస మండపంలో శ్రీవారు, అమ్మవార్లు, గోదాదేవికి అర్చకులు విశేష పూజలు జరిపి, భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. అధ్యయనోత్సవాల్లో భాగంగా రాత్రి స్వామివారు ఉభయ దేవేరులతో క్షేత్ర పురవీధుల్లో తొళక్క వాహనంపై ఊరేగారు. ఈ వేడుక భక్తులకు నేత్రపర్వమైంది.



తొళక్క వాహనంపై ఉభయ దేవేరులు, గోదాదేవితో ఊరేగుతున్న స్వామివారు

50 మందికి కళ్లజోళ్ల పంపిణీ

జంగారెడ్డిగూడెం రూరల్: పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ వైద్య శిబిరాల్లో కళ్లజోళ్లు అవసరమని గుర్తించిన 50 మందికి శ్రీనివాసపురంలో సోమవారం పంపిణీ చేశారు. జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, సర్పంచ్ యడ్లపల్లి రాధిక, ఉప సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు చేతుల మీదుగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తాడువాయి సర్పంచ్ యరమాల సత్యవతి, ఎంపీటీసీ జుజ్జవరపు తాతారావు, వార్డు సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

నేటినుంచి పశువులకు టీకాల అందజేత

కొయ్యలగూడెం: ఈనెల 2వ తేదీ నుంచి మండలంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం ప్రారంభమవుతుందని వెటర్నరీ డాక్టర్ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 4 నెలలు వయసు దాటిన ప్రతి పశువుకు టీకా వేయాలన్నారు. మొదటిసారి టీకా వేసిన దూడలకు, నెల రోజుల తర్వాత బూస్టర్ టీకా వేయాల్సి ఉంటుందని, మిగిలిన పశువులకు ఒకసారి మాత్రమే టీకా వేయడం జరుగుతుందన్నారు. గాలికుంటు వ్యాధి టీకాల ఆవశ్యకతను పాడిరైతులకు తెలియపరచి కార్యక్రమం విజయవంతం అయ్యేలాగా తగు చర్యలు తీసుకోవాలని పశువైద్య సిబ్బందికి సూచించారు. నెల రోజుల పాటు కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

చింతలపూడి: నామవరం పంచాయతీలో సచివాలయం వద్ద సోమవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మురళీకృష్ణ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గురించి ప్రజలకు వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ శాఖల అధికారులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



నామవరంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

జిల్లా అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా సర్వతోముఖాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలతో ముందుకెళ్లాలని ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. నానిని తన క్యాంపు కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాను మరోసారి విజయపథంలో నడపాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ జిల్లాలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టి మెరుగైన రీతిలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్ తదితరులున్నారు.

కోడి పందేలపై దాడి

పోలవరం రూరల్: పోలవరం మండలంలోని పేద్రాల గ్రామంలో కోడిపందేలపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, 3 కోడి పుంజులను, రూ.500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ తెలిపారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న సత్యసాయి సేవా సంస్థ సభ్యులు

టి.నరసాపురం: బొర్రంపాలెంలో సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. పరసా శ్రీను, స్వాతి ఆర్థిక సహకారంతో 50 మంది వృద్ధులకు దుప్పట్లు, చీరలను ఎంపీటీసీ కలపర్తి సుజాత రామకృష్ణ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో చావా వీరరాఘవులు, రామారావు, రామకృష్ణ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు అండగా ఉంటాం

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉద్యోగులకు అండగా ఉంటుందని ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. నానిని ఏపీ ఎన్‌జీఓ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు చోడగిరి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి నెరుసు వెంకట రామారావు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ప్రజలకు మెరుగైన రీతిలో ప్రభుత్వ అధికారులు, సిబ్బంది తమ సేవలను విస్తృతం చేయాలని ఎమ్మెల్యే వారికి సూచించారు.